క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): రోడ్ సేఫ్టీ చర్యల్లో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఇంజినీరింగ్ శాఖ తీసుకుంటున్న భద్రతా చర్యలపై రూపొందించిన నివేదికలను బుధవారం ఆయన స్వయంగా పరిశీలించారు. వేముల శ్యామల దేవి రోడ్డు, విశాలాంధ్ర రోడ్డు, ఏఎస్ రామారావు రోడ్డు, సింగనగర్ శాంతినగర్, ఎక్సెల్ ప్లాంట్, వాంబే కాలనీ, ఫైవులు రోడ్డు ప్రాంతాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. 23వ డివిజన్లోని దాసరి వారి వీధిలో కొత్త రోడ్డు ప్రతిపాదనపై అధికారులకు సూచనలు ఇచ్చారు. పాత రాజీవ్ నగర్ లోని పాత కమ్యూనిటీ హాల్ పరిశీలించగా కమ్యూనిటీ హాల్ పడగొట్టేందుకు ఇంజినీరింగ్ శాఖ ప్రతిపాదనపై సంబంధిత భవనానికి స్టెబిలిటీ ఉందా లేదా అని చూడాలని ఆదేశాలిచ్చారు. ప్రహరీ డిమాలిష్ చేసిన తర్వాత పరిసరాలు మొత్తం పరిశుభ్రంగా ఉంచాలని, ఇక్కడ పార్క్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. అనంతరం ఆయన ఐకానిక్ పార్క్ ను సందర్శించి పూర్తి స్థాయి వివరాలతో నివేదికను ఇవ్వాలని కోరారు. పర్యటనలో సర్కిల్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి. శ్రీనివాస్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

మహిళలపై దాడులకు రైల్వే ఉద్యోగుల నిరసన



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ విజయవాడ డివిజనల్ సెక్రటరీ ఎం.లీలా డిమాండ్ చేశారు. కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కెఎస్ఎస్ మూర్తిభవన్ నుంచి రైల్వేస్టేషన్ వరకు నిర్వహించిన ఈ ప్రదర్శనలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ దేశంలో డాక్టర్లకు, మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. డాక్టర్ హత్యాచార ఘటనలో నిందితులందరికీ వెంటనే కఠిన శిక్షలు విధించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ డివిజనల్ మహిళా కోఆర్డినేటర్ హారిక, కోశాధికారి లక్ష్మి, అధ్యక్షుడు రామగుప్తా, పెద్ద సంఖ్యలో మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సంగీత విభావరి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన నాదెండ్ల ఫణికుమారి బృందంచే ఆలపించిన సంగీత విభావరి అలరించింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ధర్మపథం వేదికపై ఫణికుమారి బృందం పలు కీర్తనలకు మధురంగా ఆలపించారు. అనంతరం శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందించారు.

26న కూచిపూడి నృత్య నీరాజనం

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో లబ్బీపేటలోని శారదా చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 26 వ తేదీ సాయంత్రం కూచిపూడి నృత్యోత్సవం నిర్వహిస్తునట్లు సంగీత సభ ప్రధాన కార్యదర్శి గౌరీనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూచిపూడి నాట్యాచార్యుడు డాక్టర్ చింతా రవిబాలకృష్ణ బృందం పలు నృత్యాంశాలను ప్రదర్శిస్తుందని పేర్కొన్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తున్న ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీకి చెందిన చెరుకురి జ్యోతికి 2017లో సత్యనారాయణకు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. కొంత కాలంగా సత్యనారాయణ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను వేదింపులకు గురి చేయసాగాడు. ఈ విషయం అత్తకు చెప్పినా పట్టించుకోవడంతో బాధితురాలు పుట్టింటికి చేరింది. అత్తింటి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. గొల్లపాలెంగట్టు ప్రాంతానికి చెందిన అవనిగడ్డ లక్ష్మీ, దుర్గారావు (64) భార్యాభర్తలు. దుర్గారావు చిన్న చిన్న పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఆరు నెలల కిందట ఇంట్లో గొడవ పడి బయటకు వెళ్లిన దుర్గారావు ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.





గణనాథులు సిద్ధం...

వినాయక చవితి పర్వదినం సమీపిస్తున్న నేపథ్యంలో గణనాథుడి విగ్రహాల తయారీ ఊపందుకుంది. రాజస్తాన్ నుంచి వచ్చిన కొందరు కళాకారులు ఏటా నగరంలో విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తుంటారు. భవానీపురంలో విగ్రహాల తయారీలో నిమగ్నమైన కళాకారుల చిత్రాలివి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

వర్గీకరణపై తీర్పును పునఃసమీక్షించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని, క్రీమిలేయర్‌ను నిలిపివేయాలని మాల మహానాడు, దళిత వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని రమేష్ కోరారు. వర్గీకరణపై దేశ వ్యాప్తంగా చేపట్టిన భారత్ బంద్‌లో భాగంగా తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగాగల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జన గణన చేసి రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని, ఎస్సీలు, ఎస్టీలను విడదీసే కుట్రలను మానుకోవాలని హితవు పలికారు. సుప్రీం తీర్పు షెడ్యూల్ కులాల అభ్యున్నతికి తోడ్పడాలి తప్ప విఘాతానికి కాదన్నారు. అలాగే ఆ తీర్పు అవకాశవాద రాజకీయాలకు వినియోగించకుండా అందరికీ న్యాయం జరిగేలా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏవీ రాజు, దళిత వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నాయకులు జీజైరావు, మధు, సాంస్కృతిక విభాగం కన్వీనర్ రంగం రాజేష్, వేముల దయారత్నం, పి.కిరణ్, సీహెచ్ కిరణ్, కేవీ కెటీ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న పంతగాని రమేష్, దళిత సంఘాల నాయకులు

రిజర్వేషన్లు సక్రమంగా అమలు జరగడం లేదు

బీఆర్ అంబేడ్కర్ మిషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బళ్లారపు జగదీష్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అన్ని రంగాల్లో రిజర్వేషన్లు సక్రమంగా అమలు జరగడం లేదని బీఆర్ అంబేడ్కర్ మిషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బళ్లారపు జగదీష్ అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కింది స్థాయిలో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారే తప్ప ఉన్నత స్థాయి ఉద్యోగాల నియామకంలో రిజర్వేషన్ అమలు కావడం లేదన్నారు. ప్రశ్నించే తత్వం లేనంత కాలం ఇలాగే జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న వారు చాలా మంది ఉన్నారని వారికి సరైన అవకాశాలు లేవన్నారు. రాజకీయ నాయకులు ఎన్నికల్లో హామీ ఇస్తున్నారే గానీ వాటిని అమలు చేయడం లేదన్నారు. ఈ విషయంలో ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పేద ప్రజలను అన్ని విధాలా ఆదుకోవడానికి, ఆర్థికంగా సహాయం అందించేందుకు కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. తమ సంస్థ ఆశయాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్తామన్నారు. దళితులపై జరిగే దౌర్జన్యాలను చట్టపరంగా అడ్డుకుంటామన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేసి ప్రభుత్వ పథకాలు, వారి హక్కులను కాపాడుకునేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు జి.కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బి.జగదీష్

విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని పోసాని నరసింహారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ మానవ హక్కులు, నేర నియంత్రణ బ్యూరో ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో పాఠశాలలోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. నగరంలోని మ్యాక్సివిజన్ ఐ హాస్పటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో సుమారు 150 మంది విద్యార్థులతో పాటు 50 మంది స్థానికులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో స్టేట్ జాయింట్ సెక్రటరీ పురాణం పద్మజ మాట్లాడుతూ సమాజంలో మానవుల హక్కులకు భంగం కలిగి ఇబ్బందులు ఎదుర్కొనే బాధితులకు సంస్థ తరుపున అండగా నిలబడి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామని చెప్పారు. అదే విధంగా సామాజిక సేవలో భాగంగా అవగాహన సదస్సులు, హెల్త్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లేళ్ల నాగలక్ష్మి, ఆప్తమాలజిస్ట్ నారాయణ, పీ నాగేశ్వరరావు, ఎండీ పాషా, హైకోర్ట్ అడ్వకేట్ సయ్యద్ అహ్మద్ పాల్గొన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న హాస్పటల్ సిబ్బంది

నామినేటెడ్ పోస్టుల్లో నగరాలకు ప్రాధాన్యమివ్వాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు డిమాండ్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నామినేటెడ్ పోస్టుల్లో నగరాల సామాజిక వర్గానికి ప్రాధాన్యత నివ్వాలని పలువురు నగరాల ప్రముఖులు డిమాండ్ చేశారు. శ్రీనగరాల సంఘం ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో బుధవారం కేఎల్‌రావునగర్‌లోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. నగరాల ప్రముఖులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్వీ రావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరం నుంచి నగరాల ప్రముఖులు పోరాటాలు చేశారని తెలిపారు. పశ్చిమ నియోజక వర్గంలో ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేలుగా బాధ్యతలు నిర్వహించిన నగర అభివృద్ధిలో విశేషంగా కృషి చేశారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా నగరాలకు అవకాశం ఇస్తారని ఆశించామన్నారు. నగరాలకు నామినేటెడ్ పోస్టులలో ప్రాధాన్యత కల్పించి న్యాయం చేయాలని కోరుతున్నామని చెప్పారు. నగరాలకు సముచిత స్థానం దక్కించుకునే వరకు నేతలందరూ ఐక్యంగా ముందుకు సాగాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాయన శేఖర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లాని సూర్యారావు, ఉప అధ్యక్షుడు శీరం వెంకట్రావు, కొత్త అమ్మవారి దేవస్థాన కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ కొరికాని అనురాధ, అడ్డూరి రాము, మజ్జి శ్రీనివాస్, నాగోతి శ్రీనివాసరావు, పొట్నూరి రవి, రాంపిళ్ల వాసు తదితరులు పాల్గొన్నారు.



నిర్ణయాలకు సంఘీభావం తెలుపుతున్న నేతలు

● నాట్యకళ ఉట్టిపడేలా..



కూచిపూడి నాట్యకళ ఉట్టిపడేలా చిత్రకారులు వేసిన పెయింటింగ్ విశేషంగా ఆకట్టుకుంటుంది. విజయవాడలోని మునిసిపల్ కార్పొరేషన్ సమీపంలో అండర్ బ్రిడ్జి కింద గోడపై కళాకారులు కూచిపూడి నృత్యం వేస్తున్నట్లు గీసిన చిత్రమిది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అనధికార లేఅవుట్లపై చర్యలకు సిద్ధం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీఎంసీ అనుమతులు లేకుండా అనధికారికంగా లేఅవుట్లు వేశారని, వాటిపై చర్యలకు ఉపక్రమించామని కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుందావారి కండ్రికలో పొన్నం మనీషా లేఅవుట్ సర్వే నం 58/1బి, 58/4బిలో ఉన్న 3.6 ఎకరాలు, ఇదే ప్రాంతంలో ఉన్న కలకోటి సీతారావమ్మ సర్వే నం 38/1ఏలో 3.45 ఎకరాల్లో అనధికారిక లే అవుట్ వేశారని తెలిపారు. విద్యాధరపురంలోని 91/పి సర్వేనంబర్‌లోని 1.21 ఎకరాలు, గుణదలలోని మమ్మినేని దినేష్ పేరుతో సర్వే నం 194లో ఉన్న 1.48, 165లో ఉన్న 1.32, 166లో ఉన్న 0.84, 180/3లో ఉన్న 3.10 అనధికారిక లే అవుట్‌ను గుర్తించామని చెప్పారు. గుణదలలోని కడియాల సుబ్రమణ్యం పేరుతో సర్వే నం 137/1లో ఉన్న 4.55, సర్వేనం 88లో 2.50 ఎకరాలు, సర్వేనం 31లో ఉన్న గద్దె శ్రీనివాసరావు పేరుతో ఉన్న 4 ఎకరాలు, సర్వేనం 54/2బిలో సూర్యదేవర మురళి పేరుతో ఉన్న 1.35 ఎకరాల్లో అనధికారి లేఅవుట్లను గుర్తించామని పేర్కొన్నారు. ఆయా లే అవుట్లలో ప్లాట్లు అమ్మకం, కొనుగోలు చేయటం, భవన నిర్మాణాలు చేయటం చట్ట విరుద్ధమని, అక్కడ మౌలిక వసతులైన రోడ్డు, విద్యుత్, నీరు, డ్రైనేజీల సదుపాయాలు ఉండబోవన్నారు.

ఏడీసీపీ కృష్ణమూర్తినాయుడుకు ఉద్యోగోన్నతి



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో క్రైం ఏడీసీపీ, ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీగా ఉద్యోగబాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.కృష్ణమూర్తినాయుడుకు ఉద్యోగోన్నతి లభించింది. నాన్ కేడర్ ఏఎస్పీ హోదాలో ఉన్న ఆయనకు ప్రభుత్వం నాన్ కేడర్ ఎస్పీ హోదాను కల్పిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగోన్నతి పొందిన వెంటనే జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకుని స్వీట్లు అందజేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



మీడియాతో మాట్లాడుతున్న యుఎస్ఎఫ్ఐ నాయకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆర్.జి కర్ మెడికల్ కాలేజీలో జరిగిన అమానవీయ ఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ సందెపోగు ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు. వించిపేటలోని యుఎస్ఎఫ్ఐ సంఘ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సందెపోగు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ట్రైనీ మెడికల్ విద్యార్థినిపై జరిగిన ఘటనలో నిందితులను ఇంత వరకు శిక్ష పడకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తక్షణమే రాజీనామా చేయాలన్నారు. ముఖ్యమంత్రి ఈ ఘటనలో నిందితులను శిక్షించకుండా రోడ్డుపైకి వచ్చి నిరసన తెలియజేయడం సరికాదన్నారు. బాధితురాలి తల్లి అనుమానించిన వ్యక్తులపై సమగ్ర దర్యాప్తు చేయాలని, మహిళల భద్రతకు ప్రతిష్టమైన చట్టాలను అమలు చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో యువజన సంఘ నాయకులు అనకాపల్లి కనకరాజు, కంకిపాటి అనిల్‌కుమార్, విద్యార్థి నాయకులు ఎస్‌డీ. సిరాజ్, యువరాజ్, జయరాజ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పటమట(విజయవాడతూర్పు): మున్సిపల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ సర్వీస్ అసోసియేషన్ నాయకులు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రకు బుధవారం వినతిపత్రం అందించారు. ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్ వద్ద అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ తిమ్మసర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కలిసిన ఉద్యోగులు వారి సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. త్వరలోనే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ అసోసియేషన్ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ సలీం అహ్మద్, అసోసియేట్ ప్రెసిడెంట్ గుర్రం ప్రకాష్ సాగర్, వైస్ ప్రెసిడెంట్ ఓ.శారద రాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓ.సురేంద్ర కుమార్, సెక్రటరీలు శర్మ, సుభాకర రావు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి


చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీసులు రూరల్‌లో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న శిబిరంలో ఉన్న నలుగురిని అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి రూ. 4300 నగదు, కోడిని స్వాధీనం చేసుకున్నారు.

కృష్ణమ్మకు జలకళ



ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో ప్రకాశం బ్యారేజీ జలకళ సంతరించుకుంది. ఎంతో అందంగా...ఆహ్లాదంగా ఉన్న బ్యారేజీ పరిసరాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వస్తున్నారు. బ్యారేజీ నుంచి దిగువకు వరద నీరు పారుతున్న తీరు చూసి సందర్శకులు ఆనందిస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఫ్లెక్సీలు తొలగించారు

సాక్షి స్పందన

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎట్టకేలకు చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని మరుపిళ్ల చిట్టి పార్క్ కనబడకుండా దాని ముందు అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు కట్టిన ఫ్లెక్సీలు తొలగించారు. ఈ నెల 18న 'సాక్షి' దినపత్రికలో 'సమరయోధుడి విగ్రహం కనబడకుండా ఫ్లెక్సీలా!' శీర్షికతో ప్రచురితమైన కథనానికి నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. చిట్టి పార్క్ బహిరంగంగా కనబడేలా..అలాగే పార్క్‌లోని స్వాతంత్ర్య సమరయోధుడు మరుపిళ్ల చిట్టి విగ్రహం కనబడేలా కట్టిన రెండు పెద్ద ఫ్లెక్సీ బ్యానర్లను తీసేశారు. అయితే వాటిని పార్క్‌లోనే భద్రపరచటం గమనార్హం. నగరపాలక సంస్థకు చెందిన పార్క్‌లో తొలగించిన ఫ్లెక్సీ బ్యానర్లను ఉంచటమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఆహ్లాదం, ప్రశాంత వాతావరణం కోసం ఏర్పాటు చేసిన పార్కా..లేక తొలగించిన ఫ్లెక్సీలు జాగ్రత్త చేసుకునేందుకా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పార్క్ ముందు ఫ్లెక్సీలను తొలగించిన తరువాత ఇలా..

సామాజిక బాధ్యతతో విద్యార్థులకు ఉన్నతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ తెలిపారు. కళాశాల సీఎస్ఈ విభాగం విద్యార్థులు స్పెక్ట్రం క్లబ్ ఆధ్వర్యంలో చిర్రావూరు గ్రామంలో సామాజిక కార్యక్రమాలను చేపట్టారు. గ్రామాన్ని దత్తత తీసుకొని పలు చైతన్య సదస్సులను నిర్వహించనున్నారు. అందులో భాగంగా తొలి రోజు గ్రామంలోని పలు ప్రాంతాల్లో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభించిన కళాశాల కార్యదర్శి అమర్ సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటుగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సామాజిక బాధ్యత కలిగి ఉన్నప్పుడు సమాజంలో మంచి ఉన్నతిని సాధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.పతంజలిశాస్త్రి, విభాగాధిపతి డాక్టర్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కీచకులపై కఠిన చర్యలు చేపట్టాలి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి ధూళిపాళ్ల రమాదేవి
- నేతాజీ స్కూల్ విద్యార్థులతో ఐద్వా నిరసన ర్యాలీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేసే దిశగా ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి ధూళిపాళ్ల రమాదేవి అన్నారు. ఇటీవల కలకత్తా వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటనకు నిరసనగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పశ్చిమ సిటీ కమిటీ ఆధ్వర్యంలో భవానీపురం నేతాజీ స్కూల్ విద్యార్థులతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ నేతాజీ స్కూల్ నుంచి ప్రారంభమై క్రాంబే రోడ్డు, ఆర్టీసీ వర్కుషాపు రోడ్డు మీదుగా తిరిగి స్కూల్ వరకు సాగింది. వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని మహిళలు, విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను సమాజంలోని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. మహిళలు, విద్యార్థినులపై ఎటువంటి నేరాలు జరగకుండా పటిష్టమైన వ్యవస్థను రూపొందించాలని కోరారు. కలకత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన సంఘటన అత్యంత దుర్మార్గమన్నారు. గతంలో జరిగిన సంఘటనలపై సరైన చర్యలు లేకపోవటంతో ఇలాంటివి చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం నియంత్రణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఐద్వా ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించాలని, అత్యాచారాలు, హత్యలు జరిగినపుడు దోషులను కఠినంగా శిక్షించేలా చట్టాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా పశ్చిమ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు కుందనాల శేషుమణి, గాదె ఆదిలక్ష్మి, కె.వెంకటరత్నం, నేతాజీ స్కూల్ కరస్పాండెంట్ కె.తిరుపతి రెడ్డి, ప్రిన్సిపాల్ కె.అరుణ, కె.శిరీష, కె.లావణ్య, గాయత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నేతాజీ స్కూల్ విద్యార్థులతో నిరసన ర్యాలీ చేస్తున్న ఐద్వా నాయకులు

రైల్వే టికెట్ చెకింగ్ సిబ్బందికి హెచ్‌హెచ్‌టీఎస్ పంపిణీ పూర్తి

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): రైల్వే టికెట్ చెకింగ్ సిబ్బందికి హ్యాండ్ హెల్డ్ టెర్మినల్ (హెచ్‌హెచ్‌టీఎస్)లను పంపిణీ చేయటం వంద శాతం పూర్తి అయిందని విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్ అధికారి ఎస్.మండురూప్‌కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని టికెట్ చెకింగ్ సిబ్బందికి, స్టేషన్లలోని స్క్వాడ్ సిబ్బందికి 988 హెచ్‌హెచ్‌టీఎస్‌లను అందజేశామని పేర్కొన్నారు. దీంతో డివిజన్‌లో నగదు రహిత, పారదర్శకత అందుబాటులోకి వస్తుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ టీచర్స్ కాలనీ ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీవీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు టీచర్స్ కాలనీ, అప్పా బజార్ రోడ్, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, దర్గా ప్లాట్స్, 450 ఎస్ఎఫ్‌టీ బ్లాకులు ప్రాంతాల్లో కరెంట్ నిలిపి వేయనున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.